("యువ" మాసపత్రిక—దీపావళి 1972)

శివాయ విష్ణురూపాయ

"అరవై నాలుగు మందొచ్చేరు, ఇంటర్వ్యూకి" అన్నాడు రామచంద్రయ్య షర్టువిప్పి వంకెన తగిలిస్తూ.

జానకి మొగాన నిరాశ పులుముకుని చూసిందంతే.

"అరవై నాలుగు మందిలోనూ ఆరుగుర్ని యేరేరు, ఇంటర్వ్యూ చేసిన బోర్డు" అన్నాడు రామచంద్రయ్య. ఈ మాటు చిరునవ్వుతో తల యెగరేసి.

"అంటే యాభై ఎనిమిదిమంది పని గోవిందా అన్నమాటేనా?"

"అన్న మాటేమిటి, ఉన్నమాటే! ఇంకా ఇప్పుడేం చూసేవు. మళ్ళీ ఈ ఆరుగుర్లో వొక్కణ్ణి యెంచాలి. అప్పుడు ఇందులో ఐదుగురిపని హరేరామ హరే క్రిష్ణా!"

"అదేం?"

"ఉన్న ఖాళీ ఒక్కటే కదుటే!"

జానకికేం తోచలేదు. అడగవలసిన ప్రశ్న గొంతుకలోంచి ముందుకి రాక మింగుడుపడక వక్కలా బాధపెట్టింది.

రామచంద్రయ్య గట్టిగా నవ్వాడు. 'నువ్వేమిటనుకుంటున్నావో చెప్పేదా?" అన్నాడామె బుజంమీద చెయ్యేసి.

"నేనేమిటనుకుంటే యేమిట్లాభం" అంది జానకి, నిరుత్సాహం అంతా వొలకబోసి చూస్తూ, నిలబడ్డపాటుని ప్రగల్భంగా నవ్వుకుంటూ గర్వపడుతూ ప్రేమ కురిపిస్తున్న మొగుడితో మాటాడ్డానికొక ధోరణంటూ దొరకలేదామెకి.

"లాభమున్నా లేకపోయినా సరే నువ్వేమనుకుంటున్నావో చెప్పేస్తున్నాను. ఇంతా హైదరాబాద్ దాకా పరీక్ష కెళ్ళి ఇంటర్వ్యూకెళ్ళి మా ఆయన గారు మా నాన్నగారి దగ్గరికెళ్ళేరో లేదో! ఒక్కసారి మామగారూ అని పలకరిస్తే ఈ వుద్యోగం మా ఆయనకి రాకుండా పోతుందా అని అనుకుంటున్నావు అవునా?"

తెల్లబోయింది జానకి. ఆమె అనుకుంటున్నది సరిగ్గా అదే.

"కాని మీ నాన్నగార్ని పలకరించకుండా, ఆయన్ని చూడకుండా, కనీసం సలా నా ఆయన మా మామగారు సుమండీ అని చెప్పుగోకుండా అరవై నాలుగు మందిలోంచి ఆరుగుర్లో వొచ్చిపడ్డాను, తెలుసా!" అన్నాడు రామచంద్రయ్య గర్వంగా.

"ఆ పట్టుదల మానేసి ఆయన దగ్గరకోసారి వెళ్ళొస్తే ఈ చివరి వడ పోతలో కూడా చిక్కంలోంచి కిందరాలిపోకుండా బంగార్లాంటి వుద్యోగం మీ కొస్తుంది. మనకిది జీవన్మరణ సమస్య. ఆయన టెలిఫోన్లో పిల్చి గోరుతో మీటితేచాలు అంతా గుప్చుప్గా సక్రమంగా జరిగిపోతుంది." అని చెప్పాలనుం టుంది జానకికి చెప్పడానికి స్వతంత్రం వుంది. చనువుంది అవసరంవుంది. అధికారం కూడా వుంది. కాని అలా చెప్పిన మీదట అలా చెయ్యకపోడానికి ఆయనకీ అవన్నీ వున్నాయేమో!

ఈ వుద్యోగం కోసం ప్రయత్నించడానికి తలపెట్టిన దగ్గర్నుంచీ అన్నీ సక్రమంగా జరగం అంటూ బెదిరిస్తున్నాయి. అడ్వర్టయిజుమెంటు ఈయన కంటికి ఆలస్యంగా అవుపడ్డది. అప్లికేషన్ఫారం తెప్పించడానికి వాళ్ళకి రాయ డానికి టైమ్ లేకపోతే హైద్రాబాదులో ఎవరో ఫ్రెండుకి టెలిగ్రాం మనియార్డర్ చేసి తెప్పించేరు– ఛలానా కట్టడానికి పదిరూపాయలు అప్పు దొరకడం గడ్డు సమస్య అయిపోయింది. వ్రాతపరీక్షకి ఇంటర్వ్యూకి రెండుసార్లు హైద్రాబాదు స్వంతఖర్చులమీద వెళ్ళి రావడమయింది. ఇప్పటికీ ఉద్యోగ ప్రయత్నపర్వం పర్వతమై రెండు వందల రూపాయల అప్పు చూపెడుతోంది.

చివరికి మిగిలేవి శ్రమాఖర్చులేనా?

"బంగారప్పళ్ళేనికయినా గోడచేరుపు వుండాలికదండీ" అంది జానకి వేదాంతిధోరణిలో యెటోచూస్తూ.

"నేను బంగారప్పళ్ళెం అయినా కాకపోయినా మీ నాన్నగారికి గోడ చక్కని వుపమానం" అని నవ్వి దూరంగా వెళ్ళేడు రామచంద్రయ్య.

జానకి మనసు చివుక్కుమంది.... గోడ లక్షణాలు కొన్ని నాన్నగార్లో లేకపోలేదు....

ఎమ్మే ఫస్టుక్లాసు, రామచంద్రయ్య. ఎలెల్బీ చదువుతూ ట్యుటోరియల్ కాలేజీలో పనిచేసేవాడు. గోల్డు మెడలిస్టు. ఆస్తీ అంతస్తూ లేకపోవచ్చు, కులం గోత్రం వుంది. వెనకాముందూ ఎవరూ లేకపోవచ్చు. విలువా విజయం

వున్నాయి. అరటిపండు వొలిచి చేతిలోపెడితే తినడానికింకా ఏవేనా అడ్డు తగలొచ్చుగాని, ఆయన పాఠం చెబితే విద్యార్థి బోధపరచుకోలేకపోవడం అంటూ వుండదు.

ఈ పెళ్ళి నాన్నకిష్టంలేదు. ఇంట్లో ఎవరికీ ఇష్టంలేదని దబాయించేసు. అమ్మ చెయ్యాసరా యివ్వకపోతే ఆయన కాళ్ళకిందపడి తన ఆత్మ నలిగిపోయేదే.

కూతురు వుందని జ్ఞాపకం వుండి, దానికొక మొగుడున్నాడని, వాళ్ళిద్దరూ కలిసి అన్యోన్యంగా స్నేహంగా వుంటున్నారని గుర్తులేనట్టు ప్రవర్తిస్తాడు. ఈ పెళ్ళిఅయిన రెండేళ్ళలోను మూడుసార్లు ఆయన్ని కలుసుకోడం జరిగింది. మొదటిసారి: ఈ వూరికి ఆయనగారు క్యాంపువచ్చారుట. ఎవరో కలెక్టరాఫీసు వాళ్ళు వచ్చి చెప్పారు. అమ్మాయిగార్ని రమ్మన్నారని జీపుపంపేరు. ఆహ్వానంలో ఆప్యాయత లోపించడం బహిరంగంగానే కనబడింది. వెళ్ళలేదు.సాయంకాలం బజార్లో ఆయన్తో వెళుతూ వుంటే వెనకాల కారుహారన్. తలతిప్పిచూస్తే నాన్నగారు. పక్కన అల్లుడున్నాడన్న సంగతి నాకు కనబడనేలేదన్నట్టుగా రెండు నిమిషాలు మాటాడారు, కారుదిగి. 'ఆయనకి నా సంగతి జ్ఞాపకం లేదు. నీకూ లేదేం!' అని రామచంద్రయ్య—సరదాకే—అన్నాడు. కాని ఎంత గాయపడింది, గుండె!

క్లాస్‌మేటు అరుణ పెళ్ళి రాజమండ్రిలో జరిగింది. ఒస్తేనే కాని వీల్లేదని వాళ్ళతోబాటు కార్లో తీసుకుపోయింది. అక్కడికి మొగపెళ్ళివారి తరపున వచ్చారుట నాన్నగారు. పెళ్ళికొడుకు తండ్రి నాన్నగారి దగ్గర జాయింటు సెక్రెటరీ. అక్కడ ముఖాముఖీ రామచంద్రయ్య వచ్చాడా అనిగాని, రాలేదా అనిగాని అడగలేదు. అతని ఆరోగ్య సంపాదన స్థితిగతులు— ఏవీ భోగట్టా చేయలేదు.

మూడోసారి; శ్రీకాకుళం కలెక్టరాఫీసుకి తణిఖీ కెళుతూ 'వాల్తేరులో నా రైలు అరగంటాగుతుంది. వచ్చి కనపడు' అని కార్డు రాసేరు. వెళ్ళకూడదనే అనుకుంది. రామచంద్రయ్య బలవంతంగా సిటీబస్సెక్కించి పంపేడు. అప్పుడూ అంతే.

ఆయనగారు ఆఫీసరయితే ఈయనగారు ఆయనకి అల్లుడు. అల్లుడనే కారణం చేత జులుంచెయ్యడం చేతకాదు. కాని ఏదోబలం— వ్యక్తిస్వాతంత్ర్యం కావచ్చు. ఆబలంతో ఆయన్ని ఈయనా నిర్లక్ష్యంగానే చూస్తూ వచ్చాడు.

ఈ ఒక్క వేపు నుంచి అలక్ష్యం అవమానం మినహా ఈయన జీవితంలో ఎక్కడా అంగుళం మేర చిరుగులేదు. ఒక్కనాడు దుఃఖం, చీకటి, మౌనం ఉదాసీనత లేవు—— పాతబడిన ఈ యింట్లో స్థిరమైన సంపాదనా శాశ్వతమైన వుద్యోగం లేవన్న చింత లేకుండా ఈ రోజులన్నీ ఇలా హాయిగా గడిచిపోతు న్నాయంటే దానికి కారణం ఈయన గొప్పతనం చాకచక్యం సంస్కారం కావా!

"మీరొక్కరు మడిగట్టు కూర్చుంటే సరిపోయిందా! మీరు చెప్పిన ఆరు మందిలో మిగతా ఐదుమంది ఏ మినిస్టర్నో సెక్రటరీనో ఆశ్రయించి ఈ వుద్యోగం సంపాదించుకునే ప్రయత్నాలు చెయ్యడంలేదని మీకెలా తెలుసు? మా నాన్నగారు కాకపోతే మరొకరు. మీరీ చివరివడపోతలో కిందికి దిగి పోకుండా చూసే బంగారుతండ్రి మరో మహానుభావుడు—— ఎవర్నో ఆశ్ర యించడం మంచిదేమోనండి' అంది. చివరికి ఉండలేక, అతను బయల్దేరుతున్న సమయంలో జానకి.

"ఇలాంటి వడపోతలు ఎన్నొచ్చినా సరే నేనలాంటి పనిచెయ్యను" అన్నాడు రామచంద్రయ్య.

o o o

గవర్నమెంట్ సెక్రటరీ నారాయణరావుగారి విజిటర్స్‌రూమ్‌లో ఒంట రిగా కూర్చున్నాడు రామచంద్రయ్య. 'అయ్యగారు విజిటర్స్ అందర్నీ చూసేసి లోపలి కెళ్ళిపోయారుబాబూ. భోజనంచేసి వస్తారు కూర్చోండి' అని అటెండర్ తాను చెయవలసిన మర్యాద చేసేడు.

పక్కగదిలో అత్తగారూ, మామగారూ మెల్లిగా మాట్లాడుకుంటున్నారు. వినబడుతూనే వుంది. కాని ఆ గదికీ ఈ గదికీ మధ్య మందమైన దుప్పటితెర. మా మధ్యని తెరలాగే ఉంది.మా మధ్యనీ తెర —— అనుకున్నాడతను. తెరలా తనని మరుగుపరుస్తున్న సమకాలీన ప్రపంచంలోనిపోటీధోరణి తెలుసుకుని—— కాంప్రమైజ్ తెరలోంచి.

'చీటీరాసి ఇవ్వండి బాబూ, తమపేరూ ఊరూను. అయ్యగారికి చూపి స్తాను' అని నిశ్శబ్దంగా సూచించాడు అటెండరు.

'ఆయనంతట ఆయనొచ్చిచూస్తే పలకరిస్తాను. లేకపోతే నాదార్ని నేను పోతాను. అంతేకాని చీటీరాసి పంపుకునే అవసరంలేదు' అన్నట్టుగా బిగిసి పోయి కూర్చున్నాడు రామచంద్రయ్య-వద్దని అటెండర్‌కి సంజ్ఞచేసేసి.

ఫోన్ గణగణ మ్రోగింది.

'హలో– అత్తగారందుకుంది ఫోన్. 'నమస్కారం.... నేను వారి మిసెస్‌ని మాట్లాడుతున్నాను.... ఆయనా?.... ఇప్పుడే ఎక్కడికో బయల్దేరారు.. ఆఫీసుకే అయ్యుంటుంది.... కారుదాకా వెళ్ళుంటారు; పిలవనా?'

సంభాషణ ఆపేసి ఫోన్‌మీద మూత పెట్టినట్టు తెలుస్తోంది 'మినిస్టర్ ప్రకాశరావుగారి పరసనల్ సెక్రటరీట.'

'పదహోరు___' అన్నాడు నారాయణరావు.

'హలో– సరే.... అఁ.... అయిదుకాగానే వచ్చేస్తారు. ఆఫీసుకి రింగప్ చెయ్యొచ్చు–థాంక్సు' అని సుందరమ్మ ఫోన్ పెట్టేసినట్లు ధ్వనివినపడింది.

'కేండిడేట్లారుగురు; రికమెండేషన్లు పదహోరూను!' అని విసుక్కున్నాడు నారాయణరావు– 'వెధవదేశం, వెధవ మనుషులూనూ!'

బూట్లచప్పుడు.

వెళిపోతున్నాడు. వెళ్ళిపోయానని చెప్పేసిన కర్కోటక చక్రవర్తి నారాయణ్రావు ఆఫీసుకి నిజంగానే వెళ్ళిపోతున్నాడు.

అవేపునుంచి దారుంది. అలా గది దాటి, వరండాదాటి, కారుదాకా వెళ్ళిన చప్పుడు.

అటువేపు కూడా దట్టమైన తెరే–

కారు తలుపు తీసిన చప్పుడు.

'ఎవరు? ఇంతసేపేం చేస్తున్నాడు? వాడికి బుద్ధిలేకపోతే నీ బుద్ధేమైంది? వెళ్ళి పేరు కనుక్కురా!' గద్దింపు.

బహుశా అటెండరు___విజిటర్స్ రూమ్‌లో ఎవరో ఉండిపోయారని చెప్పుంటాడు. అయినా ఎంత పెడసరపు మాట!

తెర ఒత్తిగిల్లింది–అందులోంచి అటెండర్ మొహం కనబడ్డది.

'రామచంద్రయ్య' అన్నాడు రామిచంద్రయ్య; కూర్చునే.

'రామచంద్రయ్యగారంట, బాబూ.'

'రామచంద్రయ్యాలేదు, భీమచంద్రయ్యాలేదు అవతలికి పొమ్మను!' గద్దింపుతో కారుతలుపు మూసినచప్పుడు.

కారు బయల్దేరిన చప్పుడు.

మళ్ళీ తెర ఒత్తిగిల్లింది.

'ఆఫీసుకి దయచెయ్యమన్నారు బాబూ,' అన్నాడు అటెండరు.

"మీ రావణాసురుడికన్నా నువ్వే నయం' అనుకున్నాడు రామచంద్రయ్య లేచి.

దేముడివ్వని వరం తానే యిచ్చేసిన పూజారిలా అబద్ధపు ఆశాబీజం వేసిన అపెండరు తెరకోపక్క ఒత్తిగిలి నిలబడి తెరనోపక్కకి ఒత్తిగిల్లించి పట్టుకుని రూపాయి విలువగల చూపు చూస్తూ చెయ్యి జాపేడాలేదా అన్నంత అనుమానంగా గాల్లో పెట్టాడు.

"నీ గురించి పొరపాటు పడ్డాను. నీకన్నా మీ రావణాసురుడే నయం." అనుకొంటూ తెరదాటేడు రామచంద్రయ్య.

గబగబా నడిచి కాంపౌండున్నూ దాటేసేడతను.

అక్కణ్ణుంచి వొక్కసారి అనుకోకుండా తలతిప్పిచూసేడు. అత్తగారు గుమ్మంలో నిలబడివుంది. పక్కని అపెండర్ నిలబడున్నాడు.

తలతిప్పి ముక్కుసూటిగా నడిచేడు రామచంద్రయ్య.

అపెండరు పరుగెత్తుకొస్తున్నట్టు అతని కళ్ళు పసిగట్టాయి.

"మీరు రెండుసార్లు గెంటేశారు.... అనాలనిపించింది కసిగా. ఈ పతనం నాదికాదు. మీ గర్భవాసానిదే.... అంచేత మీదేనూ." అనుకున్నాడతను, తన్ని వోదార్చుకుంటూ. "ఇంక మీరు నా దగ్గరికి రావాల్సిందే కాని నేనై మీ దగ్గరకి రావడం కల్లోమాట."

o o o

ట్యుటోరియల్ కాలేజీ గెస్టురూమ్‌లో నిద్రపోతున్నాడు రామచంద్రయ్య. తలుపు దబదబా చప్పుడైతే నిద్రలేచాడు.

తలుపుతీసి, ఎదురుగా నిలబడ్డ అత్తగార్ని చూసి నిర్ఘాంతపోయాడతను.

"నమస్కారం! దయచెయ్యండి" అని తప్పుకున్నాడు.

మామగారంటే కోపమూ, అసహ్యమూనూ అతనికి,

"వాడొక దగుల్‌బాజీ: దగాకోరు! పూటకి ఠికానాలేని పుండాకోరు! పగటిపూట ట్యుటోరియల్ కాలేజీ, రాత్రి ఎలెక్షీ అఘోరిస్తున్నాడు. నా బంగళాలో అడుగు పెడ్డానికి వాడికి తాహతులేదు. దా కూతురు ఎలాగో వాడి మాయలో పడ్డాది. వాడికి వుద్యోగం యివ్వడంవల్ల మీరు నేరంచేసినట్టు నేను భావిస్తున్నాను.' అన్నాడాయన, తన ఎదురుగా, పల్లిగ్గా, తను పనిచేసిన ఈ ట్యుటోరియల్ కాలేజీ ప్రిన్సిపాల్ కమ్ ప్రొప్రయిటర్ రామనాధంతో; అనాడు.

గవర్నమెంట్లో సెక్రటరీ, అఖండ ప్రజ్ఞాశాలి; కర్కోటకుల్లో కర్కోటకుడూ అని, ఆయన నోటికి జడిసి, నోటి కంపుకి జడిసి; రెండునెలల్లో ఎల్సెల్సీ పరీక్షలున్నాయి, అంతవరకైనా ఆగవయ్యా అని మొరెట్టుకున్నా వినిపించుకోక వెంటనే తన వుద్యోగానికి స్వస్తి చెప్పేసేడు, రామనాధం.

ఆరెణ్ణెల్లూ తనుపడ్డ అవస్థ వర్ణనాతీతం. దానిక్కారణం అయిన అలాంటి మామగారి మీద అసహ్యంకాక మరేం పుడ్తుంది.

కాని ఆ బాధంతా నయమైపోడానికీ, మర్చిపోడానికీ అత్తగారి సాయమే కారణం. ఆవిడ ఆమోదముద్ర, చెయ్యి ఆసరాలేకపోతే జానకి తనతో రాడానికే వీలుండేదికాదు. పైకేమో, నువ్వు ప్రాజ్ఞురాలివి, నీకు నా అడ్డేముంటుంది; అది అన్యాయం అని కూతుర్ని దువ్వినట్టే దువ్వి, జానకిమీద సి.ఐ.డీల్ని పెట్టింది ఆయన కాదూ! అయినా, అనుకున్న చోటికి, అనుకున్న చోటికి తెచ్చి అత్తగారే తనకి జానకిని అప్పగించింది. ఎంత అసహ్యపడ్డా ఎంత మొహమాట పడ్డా, ఆవిడ ఆరోజు స్టేషన్కి తెచ్చిన ఆయిదు వందలరూపాయలూ, జానకి బంగారపు వస్తువులూ తమకి ఎన్నాళ్ళో అదునుకి రాడం రామచంద్రయ్య మరచిపోలేని విషయం. ఆవిడకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పుగోవాలని, చేతులారా నమస్కారం చేద్దామని ఎన్నిసార్లు ప్రయత్నిస్తే అన్నిసార్లూ ఈ రావణాసురుడే అడ్డం వచ్చేసేడు. ఇవాళ అతగాడు అంత అవమానకరంగా మాట్లాడి వుండకపోతే-అత్తగార్నోమాటు పలకరించి వచ్చేవాడే. ఆయన అన్నమాట తక్కువ మాటగాదు. 'రామచంద్రయ్యా లేదు, భీమచంద్రయ్యా లేదు అవతలికి పొమ్మను!' తనపేరు తెలిసే అన్నాడు. దాంట్లో సందేహం లేదు; క్రూరుడు!— అని కసిగా అనుకుంటూ మొహం ముడుచుకుని కూర్చున్నాడు రామచంద్రయ్య.

'మొహమేనా చూపించకుండా వొచ్చేసేరు. అంత పరాయివాళ్ళం అయిపోయామా?'

'అవతలికి పొమ్మను! అని కసిరేసిన ఆత్మీయులకి మొహం చూపించడం యెలాంటిదో నేనింకా ప్రెయినింగవలేదు.'

'ఆయన కసిరేశాడనుకోండి. నేను కబురుపెట్టానుగా... అయినా, ఆయన మీరని తెలిసే కసిరేసేరనుకుంటున్నారా?.... ఏదో తొందర్లో ఆఫీసుకి వెళిపోతూ- ఆయన సంగతి మీరెరగంది కాదుకదా!'

'కాదు, మీరాయన్ని వెనకేసుకు రానక్కర్లేదు.... అయినా అంతకంటే ఎక్కువ గౌరవం జరుగుతుందని నేను ఆశించనూలేదు.... అంత గరళం కడుపులో వుంచుకున్నాక మీరు కబురు పెట్టినా నా కాళ్ళు వెనక్కి తిరగలేదు.... అది నా తప్పయితే మన్నించండి.'

సుందరమ్మ మాట్లాడలేదు.

'మీరంటే నాకు భక్తే. గౌరవమే. కాని ఎప్పటికప్పుడు మీతోకూడా నిష్కర్షగానే కఠినంగానే మాట్లాడవలసిన దురదృష్టంలో పడిపోతున్నాను. దానికూడా మీర్నను క్షమించండి.'

'మనం ఎవరంకూడా ఒకర్నొకరు క్షమించుకోగల ఔన్నత్యం పొందలేదేమోలెండి.' అంది సుందరమ్మ.

'కావచ్చు.'

'కులాసాగా వున్నాం. ఫలానా చోటున్నాం అని ఉత్తరం రాయడం కూడా మానుకున్నారు. హైదరాబాదుకి ఎన్నిమాట్లువొచ్చుంటారో— కనబడ్డం పోయింది, కనీసం ఫోన్లోనైనా పలకరించరాదా?....ఇది మీకు న్యాయంకాదు. చదువుకున్నవారు; సంస్కారం గలవారని మా అమ్మాయి మిమ్మల్ని నమ్ముకొని మీతో వొచ్చేసింది. ఏదో పెద్దవాళ్ళం మాకుండే బలహీనతలు మాకుంటాయి. అవి గాయాలూ. వ్రణాలూ అయిపోకుండా చూసే బాధ్యత మీకు మాత్రం లేదా?" అని కళ్ళొత్తుకుంది సుందరమ్మ.

రామచంద్రయ్య మాట్లాడలేదు.

సుందరమ్మా కాసేపేమీ అన్లేదు.

మళ్ళీ ఈ నిశ్శబ్దం ఏ దూరాలు తెస్తుందోనని ఇద్దరూ అల్లాడిపోతున్న సమయంలో సుందరమ్మే సంభాషణ ఆరంభించింది. అదీ ఎలాగు—

"ఎక్కడవున్నారు; విశాఖపట్టణంలోనేనా?"

"అవునండి"

"ట్యుటోరియల్ కాలేజేనా?"

"అవునండి"

"పాపాయి కులాసా?"

"అవునండి"

"ఏదేనా విశేషం—?

"ఛిఛీ అదేం లేదండీ."

"పన్లూ అవీ చేసుకోగలుగుతోందా? నేనేమీ మప్పలేదు. గారంచేసి పాడు చేసేను, దాన్ని—"

'అవసరం ఆలోచనకి ఆధారమండి....అయినా ఏం పెద్ద పన్లుంటాయని? ....ఇద్దరం!....ఇద్దరికీ వ్యాపకాలున్నాయి. కలిసి వెళిపోతాం; కలిసి పనిచేసుకుంటాం.'

'వ్యాపకాలా? అంటే, ఎక్కడన్నా పని చేస్తోందా?'

'పని కాదండి. బియ్యే చదువుతోంది.'

'కాలేజీకెళ్ళే?,

'ఆహా! కాలేజీకెళ్లే, ఏం, వెళ్ళక? అంతకన్నా పెద్దవాళ్ళు నాదగ్గర ట్యుటోరియల్ కాలేజీలో మెట్రిక్కూ పియ్యూసీ చదువుతున్నారు?'

'మీరున్నారు దానికి చదువుకు లోటుండదు.'

రామచంద్రయ్య నవ్వేశాడు. 'సరస్వతీ కటాక్షమే గాని లక్ష్మీ కటాక్షం లేదంటారా?'

"లేదని నేనెందుకంటాను? ప్రయత్నంలో వుంటుంది బాబూ, పురుషుడి భాగ్యం.శక్తిమీద నమ్మకం కలవాళ్ళూ శక్తివంచన లేకుండా పనిచేసే వాళ్ళూనూమీరు.'

'నేనేకాదు. మామగారూ అంతే. రివిన్యూ ఇన్‌స్పెక్టరుగా జాయినై సెక్రటరీ ఉద్యోగానికి రాలేదా, వారు!?'

'పొగడ్తకింద ఏదో అగడ్త'ని శంకించి అయోమయంగా చూసింది సుందరమ్మ.

'ఎటొచ్చీ ఇతరులు వారిమీద అధారపడి వృద్ధిలోకొస్తె సంతోషించే స్థాయికి ఎదిగిపోయి ఆయనకి మా ఆదర్శాలు బోధపడకుండా వున్నాయనుకుంటాను!'

సుందరమ్మ అతనివేపొకసారి చూసి నేలకి చూసింది. గొంతు సవరించుకొని 'మీరేం, వచ్చారు?' అంది.

'నిజానికి రెణ్ణెల్లలో ఇక్కడికి రావడం యిది మూడోసారి,

'అదేం, ఆలాగ?'

-కథంతా సూక్ష్మంగా చెప్పాడు- 'ఎల్లుండి ఇంటర్‌వ్యూ.'

సుందరమ్మ దీర్ఘంగా నిట్టూర్చింది. 'అందుకని-మీ పట్టుదల వదిలి మామగారిదగ్గిర కొచ్చేరన్నమాట!' అన్నది. చిన్నగా నవ్వొచ్చిందామెకి.

'మీ రన్నది నా కర్థంకాలేదు....ఈ వుద్యోగానికి మామగార్ని నా గురించి రికమెండు చెయ్యమని అడగడానికి వొచ్చేననుకుంటున్నారా?'

'రికమెండేం ఖర్మ? ఇచ్చేదే ఆయనగా;'

తుళ్ళిపడ్డాడు రామచంద్రయ్య. 'ఇదొకటా?' అన్నాడు. పొద్దున తను ఆయన బంగళాకి వెళ్ళడం ఎంత క్షమించరాని నేరమో ఒక్కసారి అర్థమైపోయింది.

'ఆదేమిటలా అంటారు? మీరు అప్లయ్ చేసింది.... ....డిప్యూటీ రిజిస్ట్రార్ ఉద్యోగానికి కాదూ?'

'అవునండీ—'

'మరదే! ఆ సెలక్షన్ ఆఖరి ఇంటర్వ్యూ మీ మామగారు కండక్ట్ చేస్తారు! అదేదీ మీకు తెలియనట్టు మాటాడతారేం?'

'నాకు తెలియదూ, తెలియదూ. ఎంతమాత్రం తెలియదు! నా కొచ్చిందల్లా ఇదుగో ఈ లెటరు-' అని. వంగి, సూట్ కేసులోంచి ఒక కాగితంతీసి ఇచ్చాడు. 'రెండుసార్లు హైదరాబాదు వెళ్ళికూడా మాయింటికి వెళ్ళేరుకాదు; మా అమ్మకైనా కనిపించేరుకాదంటూ జానకి కళ్ళ నీళ్ళు పెట్టుకుందని పొద్దున్న మీ ఇంటికొచ్చేను........'

సుందరమ్మ అతని ఇంటర్వ్యూ లెటర్ చూసింది. అందులో అభ్యర్థుల లిస్టులేదు. ఇంటర్వ్యూ చేసే అధికారి పేరుగాని హోదాకాని లేదు. ఇతన్ని ఎల్లుండి పదిగంటలకి ఫలానా ఆఫీసుకి రమ్మనుంది, అంతే........కానీ మిగిలిన కేండిడేట్సు కొందరున్నారు. వాళ్ళలో నలుగురు అప్పుడే మినిస్టర్ల ద్వారా.ఇంకా కొందరిద్వారా నారాయణరావును ఆశ్రయించడం జరుగుతోంది........ఒత్తిడి తేవడం అవుతోంది.

ఆమె లేచింది. "సరే-నేవెళ్ళొస్తాను.... సెలెక్షన్ ఆయనే చేస్తారు. అప్పుడే చాలామందికి తెలిసింది. మీకూ తెలిసిందేమో అనుకున్నాను....ఎన్ని రికమెండేషన్లు, ఎన్ని ఫోన్‌కాల్సు! ఇల్లెగిరిపోతోంది —.... మినిస్టర్లూ ఎమ్మెల్యేలూ చెబితే ఆయన కెలాగూ కిట్టదనుకోండి...కాని మీరంటే మరీ కిట్టదే!.... భగవంతుడా! ఈ గండం ఎలా గడిచేటట్టు?"

రామచంద్రయ్య తను తీసుకున్న గోతిలో తనే పడిపోయినప్పటి బాధ పడ్డాడు. పశ్చాత్తాపానికికూడా అవకాశంలేని నేరం ఇది. శిక్షే దీనికి గతి. ప్రాయశ్చిత్తంలేదు. జానకి సెంటిమెంటుకి తన వ్యక్తిత్వం, జీవితానందమైన ఆత్మ విశ్వాసం అన్నీ బలై పోయాయి. 'ఇంక ఇంటర్వ్యూకెందుకు నేను?! ఇంటికెళ్ళి పోవచ్చేమో.' అనుకున్నాడు అన్నాడు.

'అలాంటి పిచ్చిపన్లు చెయ్యకండి....ఇంతవరకూవచ్చి ఇంటర్వ్యూ మానెయ్యడం ఎందుకు!....మీరొక పనిచేస్తారా!?....సాయంకాలం మళ్ళారండి.... అదికాదు, మీకు తెలీదు....నేనున్నానుగా!....మీకేమైనా అవమానం జరిగితే అది నా పూచీ....తప్పకుండారండి....మీ కాయన ఈ ఉద్యోగం ఎలా ఇవ్వరో నేను చూస్తాను....అయిద్దాటేకరండి....మీ తరపున నేనాయన్తో దెబ్బలాడతాను....మా అల్లుడవటమే ఈ ఉద్యోగానికి మీ డిస్‌క్వాలిఫికేషనైతే ఆయన ఇంత పెద్ద ఉద్యోగంలో వుండి అల్లుణ్నిలా చూడ్డం ఈనాటి ఈ ప్రభుత్వానికొక డిస్‌క్వాలిఫికేషన్ కాకుండాపోతుందా!' అంటూ వెనకాతల ఆతను నిశ్శబ్దంగా వస్తూ వుండగా, ముందు నడుస్తూ ఆ ఆవరణ దాటింది సుందరమ్మ.

○ ○ ○

ఐదూ ఐదయ్యేసరికి నారాయణరావు కారు బంగళాకి చేరింది. నారాయణరావు కారుదిగి గబగబా లోపలికొచ్చేశాడు. అతన్ని చాలా కుతూహలంతో గమనిస్తూ, అల్లుడి సంగతి ఎలా చెప్పడమా అని ఉత్కంఠతో ప్రణాళికలు వేస్తోంది సుందరమ్మ.

మొహం కడుక్కునివచ్చి అక్కడ సిద్ధంగావున్న నిమ్మకాయరసం పుచ్చుకున్నాడు నారాయణరావు.

'చల్లగా ఉన్నట్టుంది; డాబామీద కూర్చుందామా?' అన్నాడు.

సుందరమ్మ తలూపింది.

'అయితే కుర్చీలు వేయించు.' అని అద్దందగ్గిర కూర్చున్నాడు నారాయణరావు.

ఫోన్ మ్రోగింది—

'వెధవలు—చూడు....పొద్దుటివాడే కాబోలు. అయిదుగంటలకి రింగప్ చేస్తానన్నాడుకాదూ! గొప్ప వంక్చులివాటీకీపవ్ చేస్తున్నాడు—'

'హలో—'సుందరమ్మ ఫోన్ తీసింది. 'అవునండీ నమస్కారం.... ఇప్పుడే వచ్చినట్టున్నారండి; చూసి చెప్తాను....' ఫోన్ రిసీవర్ చెవిమూసింది. 'చీఫ్ సెక్రటరీగారి పి. ఏ.—'

నారాయణరావు లేచొచ్చి రిసీవరు అందుకున్నాడు. 'హలో—నారాయణ రావు స్పీకింగ్.'

'సారీ సార్....సారీ టు డిస్టర్బ్ యు....ఇందాక ఆఫీసుకు ఒక కవరు పంపేం...దాని ఎక్నాలెడ్జ్ మెంట్ మీ పి.ఏ. ఇచ్చేరు....అది అందిందా అని చీఫ్ సెక్రటరీగారు అడగమన్నారు——'

'అందిం దందింది.'

'అది సీక్రెట్ ఎండ్ ఇమ్మీడియట్ సార్. అందులో, లోపలొక సీల్డ్ కవరుంటుంది. అదంతా ఇంటాక్ట్ గా అందిందా లేదా, వెరిఫైచేసి తమర్ని స్వయంగా ఎక్నాలెజ్ చెయ్యమన్నారండి....సారీ ఫర్ ది ట్రబుల్ సార్.'

'ఫరవాలేదు——వెరిఫైచేసి. రాసి పంపిస్తాను. మీ రెక్కణ్ణుంచి మాట్లాడుతున్నారు?'

'బంగళానుంచి సార్.'

'యువిల్ గెటిట్ ఇన్ టెన్ మినిట్స్' ఫోను పెట్టేశాడు.

గబగబ నడిచి కోటు జేబులోంచి కవరు తీశాడు. 'ఐదుగంటలకు సరిగ్గా తెచ్చిచ్చాడు స్టెనో. పేరుపెట్టి రాసేరు. మోస్ట్ ఇమ్మీడియేట్, సీక్రెట్ కదా అని జేబులోపెట్టి తెచ్చేసేను—కార్లోనే ఓపెన్ చేసుండవల్సింది. కోట్ స్టాండ్ నుంచి సోఫావరకు నడుస్తూ జవాబు ఆశించకుండా మాట్లాడాడు నారాయణరావు.

సుందరమ్మ చూస్తోంది.

సోఫాలో కూర్చుని కవరు విప్పాడు నారాయణరావు. సీల్డుకవరు ఓసారి అటూ ఇటూతిప్పి తణిఖీచేసి, సరిపోయిందన్నట్టుగా తలాడించేడు . 'యెస్! సుందరీ. ఒక ఎక్నాలెడ్జ్ మెంటు, ఒక బ్లాంక్ కవరుమీద చీఫ్ సెక్రటరీగారి ఎడ్రెసు టైప్ చేసిపెట్టు?' అని, సీల్డుకవరు బ్రేక్ చేసేడు. 'నెంబరు, డేటు దీంట్లో వుంటాయి; దీనిప్రకారం టైప్ చెయ్యి....'.... సీక్రెట్టుట, సీక్రెట్టు. ఫార్స్ చూసేవా: మూడ్రోజుల్నుంచీ ఆదరగొట్టేస్తున్నారు ఊరంతాను. వాళ్ళం దరికీ తెలిసిన సీక్రెట్టు మనకి ఇప్పుడు పంపించేరు.... సీక్రెసీ కాదిది హిపో క్రిసీ—!'

కాగితం ఆమెకి అందిస్తున్నవాడే, హఠాత్తుగా వెనక్కి లాక్కున్నాడు నారాయణరావు. ఆరు సెకెండ్లలో చదవడం పూర్తయిన ఆ కాయితంలో ఏదో అరనిమిషంపాటు అతని దృష్టిని ఆకర్షించి అక్కడే నిలబెట్టింది. అతను దీర్ఘంగా నిట్టూర్చి తల నిలువుగా ఆడించేడు.

సుందరమ్మ గమనిస్తోంది.

రెండు దొంగచూపుల్తో ఆమె గమనిస్తోందన్న సంగతి కనిపెట్టేశాడు నారాయణరావు. పొద్దున్న రామచంద్రయ్య రావడం అతనికి గుర్తువచ్చేసింది.

'ఒక లెటర్ చెప్తాను, షార్ట్ హేండ్ నోట్ బుక్కూ పెన్సిలూ తీసుకో.' అని కాగితం మడతపెట్టేసేడు నారాయణరావు.

సొరుగులోంచి పుస్తకం పెన్సిలూ తీసింది సుందరమ్మ.

'స్ట్రిక్ట్లీ కాన్ఫిడెన్షల్—' అని కాళ్ళు టీపాయ్‌మీద బారజాపి, సోఫాలో బాగా వెనక్కి జార్లబడి, సీలింగుఫాన్ వంక చూస్తూ ప్రారంభించాడు నారాయణరావు.

* * *

'అన్యాయం' అంది సుందరమ్మ, టైప్ చేసిన కాయితాలు నారాయణరావు కందిస్తూ.

'చాలా ఆలస్యంగా అన్నావు.'

'అంటే?'

'నేను షార్ట్ హేండ్‌లో రిపోర్టు డిక్టేటు చేసినప్పుడే నువ్వామాట అంటా వనుకున్నాను.'

'కొన్ని అన్యాయాలు చూసీ చూడగానే అర్థంగావు.'

'కొన్ని గొప్పపన్లు చేసి చూపించినా అర్థంకావు; నీలాంటివాళ్ళకి.'

'గొప్ప పనికూడా నంటారా?'

'తప్పకుండా. నూటికి ఒక్కడు కూడా ఇలాంటి పరిస్థితుల్లో ఇలాంటి నిర్ణయం తీసుకోడు.'

'ఏమైనా, మీరిలా చేస్తుండకూడదు. అమ్మాయీ అల్లుడూ మీ ఔన్నత్యాన్ని గుర్తించే అవకాశం మీ చేతులారా జారవొదులుకుంటున్నారు—'

నారాయణరావు నవ్వాడు. 'చాంచల్యమా, నీ పేరు స్త్రీ, అన్నాడు షేక్స్పియరు.'

'ఆ రోజులు పోయాయి. స్థిరనిశ్చయానికీ పట్టుదలకీ చిహ్నం ఇప్పుడు స్త్రీ!'

'అబ్బో, అబ్బో! చాలాదూరం వెళ్ళిందే. కథ! అల్లుడు మంచి వుపన్యాసమే ఇచ్చేడన్నమాట?'

సుందరమ్మ మాట్లాడలేదు—

నారాయణరావు సంతకాలు పెట్టడం పూర్తినిసి కాలింగ్ బెల్ బటన్ నొక్కారు—

'సంతకం అయిపోయింది; ఇక ఎవరేమనుకున్నా అంతే.'

'తాంబూలా లిచ్చేశాను, తన్నుకు చావండి, అన్న అగ్నిహోత్రావధానుల్లా వున్నారు, మీరివాళ.'

'నీ అల్లుడు గిరీశం కంటె హీనుడేమో ఆలోచించేవా?'

'నా కూతురు బుచ్చెమ్మ కాదు.'

'నా శ్రీమతి మాత్రం ఇవాళెందుకో ఒట్టి వెర్రివెంకమ్మలా మాట్లాడుతోంది.'

'అభిమానాలు అపేక్షలు లేనివాళ్ళకి మిగిలినవాళ్ళంతా వెర్రివెంగళప్పల్లా అవుపడతారు.'

'సెంటిమెంటు పొరలున్న కళ్ళున్న వాళ్ళకి మిగిలిన వాళ్ళందరూ ఔరంగజేబుల్లా కనిపిస్తారు.'

'పెరటిచెట్టు ముందుకి రాదన్నారిందుకే కాబోలు.'

'నేను వాడిపెరట్లో చెట్టునని వాడనుకున్నట్టయితే వాడికిదే మందు!'

—'సార్!' అని అటెండర్ లోపలి కొచ్చాడు.

'ఈ కవరు అతికించేసి, ఇప్పుడే తీసుకెళ్ళి ఛీఫ్ సెక్రెటరీగారి బంగళాలో ఆయనకి స్వయంగా అందజెయ్యి. కార్లో వెళ్ళు.'

'అల్లుడుగారొచ్చేరండి.' అంటూ కవరు పుచ్చుకున్నాడు అటెండర్.

'రమ్మను.'

రామచంద్రయ్య లోపలికొచ్చేడు. అతని మొహంలో ఏదో కొత్తకాంతి కనబడి చిన్నబుచ్చుకుంది సుందరమ్మ. అదేమీ గమనించకుండా అతను నారాయణరావుకి నమస్కారం చేసేడు. ఆ నమస్కారం మామూలుగా అల్లుళ్ళు

మామలకు పెట్టే దండాల్లాంటిది కాదు. ఆఫీసర్లకి తాబేదార్లు పెట్టే సమస్తె ల్లాంటిదీ కాదు. విలక్షణంగా వుంది.

'దీర్ఘాయుష్మాన్ భవ-' అన్నాడు నారాయణరావు.

'ఎందుకూ? కలకాలం కష్టాలు పడమనా?' అంది సుందరమ్మ.

'కష్టే—ఫలే!' అని నవ్వాడు నారాయణరావు.

'చేతిలోవున్న ఫలం నోట్లో కెళ్ళేదాకా రూఢి లేనప్పుడు ఇంకా కష్టేఫలె అంటూ తత్వంచెప్పి మోసం చెయ్యడమెందుకు?' గొంతుకలో వెలక్కాయంత ఉక్రోషం అడ్డంపడి సుందరమ్మ ఆ క్షణంలో అంతకన్నా అన్లేకపోయింది.

రామచంద్రయ్య వాళ్ళిద్దర్నీ మార్చి మార్చి చూస్తున్నాడు. వాళ్ళిద్దరూ తనక్కడ వున్నట్టు గమనించకుండా ఒకరి కళ్ళలో కొకరు చూసుకుంటూ మాట్లాడుకున్నారు.

'స్స్!' అని చేత్తో ఆగమని సంజ్ఞ చేసి, ఆమె మాటల్ని తానే అరికట్ట గలిగినంత దర్పహాసం చేసేడు నారాయణరావు.

'మీరా? నవ్వుతున్నారా? ఇంకా ఎన్నాళ్ళు నవ్వుతారు?' అన్న ధోరణి వచ్చేసింది సుందరమ్మకి. 'మిమ్మల్ని పెళ్లాడినప్పుడే తెలుసుకున్నాను' అని ఆమె హఠాత్తుగా బిగ్గరగా మాట్లాడసాగింది. 'మీకెవరిమీదా అపేక్షలూ అభిమానాలూ లేవు. కాపరాని కొచ్చినప్పట్నుంచి చూస్తూనేవున్నాను. పిల్లలుపుట్టిన నాటి నుంచి దినదినం చెబుతూనే వున్నాను. వాళ్ళు పెద్దాళ్ళయ్యాక ఇహచూస్తూ వూరుకోలేక మొర్రెట్టుగుంటూనే వున్నాను— కాని మీరు ఎప్పటికప్పుడు జావ గారిపోతూనే వున్నారు. మీ బలం మనకో, మన బంధువులకో పిల్లలకో పని కొస్తుందని తెలిసిన సమయానికి అస్త్రసన్యాసం చేస్తూనే వున్నారు. ఇది చాతకాని తనమో తెలీదూ; సిగ్గులేని తనమేమో నా కంతకన్నా తెలీదు. అందర్నీ పాలించే నారాయణమూర్తి వారిపేరు పెట్టుకుని అయినవాళ్ళకి ఆకుల్లోను, కానివాళ్ళకి కంచాల్లోను పెట్టడం ఇదేం బాగులేదు.'

'సుందరీ!' అని గావుకేక పెట్టాడు నారాయణరావు. 'ఏమిటి, ఫూల్లాగ మాట్లాడతావు?'

'ఎవరు ఫూలో, కొంచెం ఆలోచిస్తే తెలుస్తుంది!' అంది సుందరమ్మ మళ్ళీ బిగ్గరగానే.

'ఐసే, షటప్!' అని లేచి వెళ్ళాడు నారాయణరావు.

రామచంద్రయ్య నిర్ఘాంతపడి చూస్తున్నాడు. 'ఐమ్‌సారీ—' అన్నాడు; నారాయణరావలా వెళ్ళగానే.

'ఆ మాట అనవలసింది నేను బాబూ' అని, అద్కడున్న డూప్లికేటు కాపీ రిపోర్టు అతనికి అందించింది.

అతనది ఆత్రంగా అందుకొని చదువుకున్నాడు. 'శ్రీ చీఫ్ సెక్రటరీ గారికి; నమస్కారం- పైనుదహరించిన ఆర్డర్‌లో నన్ను ఒకానొక ఇంటర్‌వ్యూ జరపమన్నారు కాని, కొన్ని కారణాలవల్ల ఆ ఇంటర్‌వ్యూ జరిపి నేనిచ్చే నిర్ణయం ఏదైనాసరే, అది నా వ్యక్తిగత నిర్ణయమే అయిపోయే ప్రమాధం వుంటుందని భావిస్తూ, సదరు ఇంటర్‌వ్యూ చేసే బాధ్యత నేను స్వీకరించలేనని, తెలియజేయడానికి మిక్కిలి విచారిస్తూ వున్నాను.'

కాగితం క్షుణ్ణంగా చదువుకొనిచిరునవ్వుతో సుందరమ్మకు అందించాడు రామచంద్రయ్య. 'ప్రాజ్ఞులుమీరు. రాగద్వేషాలకి అతీతులై వుండాలి. కనీసం మామగార్ని చూసైనా తెలుసుకోలేరా;' అనాడు, 'ఆయన అలా రాసిపంపటం మన కుటుంబానికి ఎంతో మేలు. ముఖ్యంగా నాకు అదెంతో ఉపకారం.'

ం ం ం

'పెద్ద ఫిక్స్‌లో పెట్టేశారే,నన్ను!'అన్నాడు శివయ్య, గవర్న్‌మెంట్‌లో ఇంకో సెక్రెటరీ.

'నేనా?' అన్నాడు నారాయణరావు.

'తెలుసులెండి సార్. ఎందుకు దాస్తారు! ఈ ఇంటర్‌వ్యూ అసలు మీరు కండక్టు చెయ్యవలసిందట, "కారణాంతరాలవల్ల" మీరు ఇది స్వీకరించలేదట;; అందుకని ఈ వురిశిక్ష నాకు విధించారట!'

'ఉరిశిక్షా కాదు ఏంకాదు. మీరుకూడా అలా అంటే ఎలా?'

'ఏదో ఒకటి; మీ ప్రసాదమేగా, ఇది?....చెప్పండి బాబూ చెప్పండి.ఈ ఇంటర్వ్యూలో ఏదో పితలాటకంవుంది. రేపు ఉదయం పంపిస్తారుట, డిటేల్సు, ఎంగేజ్ మెంట్సు మీ పెట్టుకోకుండానట; టెలిఫోన్‌లో పిక్సప్ చేసేరు?'

'ఇంకేం, దంచెయ్యండి.'

'క్లూ ఇవ్వండి—'

'క్లూ ఏం ఖర్మం,వివరాలేఇచ్చాను;చీఫ్ సెక్రటరీగారికి పంపిన రిపోర్టులో'

'మీ రిపోర్టు కాపీ నాకు పంపలేదు.'

'ఐసీ-దానికి నేనేంచెయ్యగలను!'

'మీరు సాల్వుచెయ్యలేని ప్రాబ్లెమ్ నేను సాల్వ్‌చెయ్యగననా?'

'అని చీఫ్ సెక్రటరీగారు అనుకున్నారు!'

'మీరు కూడా అనుకుంటున్నారా!'

'నాకు ముందేతెలుసు. అందులో సమస్య నేను తప్ప ఎవరైనా సరిగ్గానే సాల్వ్‌చేస్తారు.'

'ఐసీ-అయితే ఇది మీ స్వవిషయం అన్నమాట.'

'ఏమో; మీరే ఊహించుకోండి.'

'ఏం వూహించుకోనక్కర్లేదు. నే నింకా ఏదో పెద్దఒత్తిడి వస్తోంది కాబోలు; చీఫ్ మినిస్టరా, ఫైనాన్స్ మినిస్టరా. చీఫ్ సెక్రటరీయా, బోర్డు మెంబర్సా- ఎవరున్నారిందులోనని ఊరికే స్పెక్యులేట్ చేస్తున్నాను.'

'ఆఫ్‌కోర్సు వాళ్ళూ లేకపోలేదు, ఈరింగులో.'

'తెలిసిపోయిందిలెండి సార్. వాళ్లెవరో వున్నారన్న కారణంచేత ఇలాంటి బాధ్యతల్ని మీరు ఎన్నడూ మరొకరి మీదికి షిఫ్టుచెయ్యలేదు. అంచేత ఇందులో ఎవరో మీ స్వంతమనుషులే-'

'నేనేంచెప్పను-' అన్నాడు నారాయణరావు, నిర్లిప్తంగా; కొంచెం విషర్షగా కూడా. 'ఇప్పటికి చెప్పిందే చాలా ఎక్కువ!'

'ఇంత కన్నా ఇంకేంచెస్తారు! అందులో మీరు!' అనుకున్నాడు శివయ్య 'మిగతాది నేను చూసుకుంటాను హర్. యు కెన్ లీవిట్ టు మి-' అన్నాడు చిరునవ్వుతో.

నారాయణరావు అప్పుడు నవ్వాడు.

శివాయ విష్ణురూపాయ!